సాక్షి మెదక్

శుక్రవారం । 13 । డిసెంబర్ । 2024



చుక్ చుక్ పనులు.. చకచకా

కొమురవెల్లి మల్లన్న భక్తులకు త్వరలో ప్రయాణ తిప్పలు తప్పనున్నాయి. రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి.

వివరాలు 8లో ▸



ఆశాభావంతో ఆడితేనే గెలుపు

క్రీడాకారులు పోటీలో గెలవాలన్న ఆశాభావంతో ఉంటేనే గెలుపు దక్కుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు.

వివరాలు 9లో ▸

'ఓపెన్' ఫీజు గడువు పొడిగింపు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఓపెన్ స్కూల్ విధానంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశం పొందేందుకు నిర్ణీత అపరాధ రుసుంతో ఈ నెల 16వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు సంగారెడ్డి డీఈఓ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిర్ణీత ఫీజు కంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముక్కిపోయి.. పురుగుపట్టి

రూ. అర కోటి విలువైన ఫోర్టిఫైడ్ రైస్ మట్టిపాలు

- గతంలో రూ. కోట్లు విలువ చేసే రేషన్ బియ్యం పక్కదారి
- గోదాముల్లో నిల్వ ఉన్న సరుకుపై పట్టింపేది?
- సివిల్ సప్లై శాఖలో బయటపడుతున్న లొసుగులు



మెదక్ గోదాంలో ముక్కిపోయిన బలవర్ధక బియ్యం

అధికారుల నిర్లక్ష్యంతో రూ. కోట్లు విలువ చేసే రేషన్ బియ్యం పక్కదారి పట్టడంతో పాటు ముక్కిపోతున్నాయి. తాజాగా మరో రూ. అరకోటి (బలవర్ధక) బియ్యానికి పురుగులు పట్టింది. గోదాముల్లో నిల్వ ఉంచిన బియ్యానికి సంబంధించి సరైన నిర్వహణ లేకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొంది. సివిల్ సప్లై శాఖలో గతంలో ఇక్కడ విధులు నిర్వర్తించిన ఓ జిల్లా అధికారి నిర్వాకంతో అనేక లొసుగులు వెలుగు చూడటం.. పలువురి సిబ్బందిని సస్పెండ్ చేయడం మరవకముందే మళ్లీ సంఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశమైంది.

మెదక్‌జోన్: జిల్లాలో గతంలో మెదక్, రామాయంపేట, చేగుంట, తూప్రాన్ గోదాముల్లో టన్నుల కొద్ది బియ్యం పక్కదారి పట్టింది. పలువురు గోదాం ఇన్‌చార్జిలను సస్పెండ్ చేసి జైల్లో పెట్టి వారిపై ఆర్‌ఆర్‌యాక్ట్‌ను సైతం ప్రయోగించారు. అలాగే మెదక్ మండలం బొల్లారంలోని ఓ ప్రైవేట్ గోదాముల్లో ఉన్నతాధికారులకు కనీస సమాచారం లేకుండా అప్పట్లో సివిల్ సప్లై శాఖలో విధులు నిర్వర్తించిన ఓ ఉన్నతాధికారి టన్నుల కొద్ది బియ్యం నిల్వ చేశారు. సరైన నిర్వహణ చర్యలు చేపట్టకపోవడంతో అవి ముక్కిపోయి లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయింది. తాజాగా మెదక్ పట్టణంలోని గోదాంలో 2021లో 95 వేల మెట్రిక్ టన్నుల బలవర్ధక బియ్యాన్ని నిల్వ చేశారు. వీటి విలువ రూ. 53.20 లక్షల వరకు ఉంటుంది. వాటిని వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందించాల్సి ఉంటుంది. కాగా వాటిని ఎప్పటికప్పుడు ప్రాధాన్యత క్రమంలో సరఫరా చేయకపోవడం, నిల్వ కోసం కెమికల్స్‌ను కలపకపోవడం, సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బియ్యం పూర్తిగా ముక్కిపోయి పనికిరాకుండా పోయాయి. ఈ విషయం బయటకు పొక్కకుండా అధికారులు జాగ్రత్త పడినట్లు తెలుస్తోంది. గతంలో సివిల్ సప్లై శాఖలోని పలు లొసుగులను 'సాక్షి' కథనాలుగా ప్రచురించింది.

మరోమారు విచారణ...



మెదక్ గోదాంలో 2021లో నిల్వ ఉంచిన ఫోర్టిఫైడ్ రైస్ (బలవర్ధక) బియ్యానికి సంబంధించి సివిల్ సప్లై కమిషనర్ ఆదేశాల మేరకు ఇప్పటికే ఓసారి విచారణ జరిగినట్లు తెలిసింది. ప్రధానంగా బియ్యం నిల్వ చేసినప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే పూర్తిగా ముక్కిపోయాయని నిర్ధారించారు. ఇదే విషయమై గతేడాది అక్టోబర్‌లో అప్పటి అదనపు కలెక్టర్ సంబంధిత సివిల్ సప్లై అధికారులకు నివేదిక సైతం అందించినట్లు తెలిసింది. కాగా మరోమారు విచారణ జరిపి పూర్తి వివరాలు పంపాలని కమిషనర్ నుంచి లేఖ రావడంతో విచారణ జరిపేందుకు అధికారులు సిద్ధమతున్నారు. సివిల్ సప్లై శాఖలో విధులు నిర్వర్తించిన అధికారి నిర్లక్ష్యంతో పక్కదారి పట్టిన బియ్యంతో పాటు, ముక్కిపోయిన బియ్యం విలువ సుమారు రూ. పాతిక కోట్లపై మాటేనని తెలిసింది.

సమన్వయంతో పనిచేయండి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

- అదనపు కలెక్టర్ నగేష్
- గ్రూప్– 2 పరీక్ష ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

మెదక్ కలెక్టరేట్: ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించే గ్రూప్– 2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలని, సమన్వయంతో పనిచేసి పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వందశాతం బయోమెట్రిక్ అటెండెన్స్ ఉంటుందని, అభ్యర్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. జిల్లాలో 16 కేంద్రాలను ఏర్పాటు చేశామని, పరీక్షకు 5,855 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల తప్పని సరిగా పనిచేసేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు సరిపడా ఆర్టీసీ బస్సులు నడిపించాలని ఆర్టీసీ డీఎంకు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ కిట్, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 9908696575 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఆర్‌ఓ భుజంగ రావు, మెదక్, నర్సాపూర్, తూప్రాన్ ఆర్డీఓలు రమాదేవి, మహిపాల్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన కోడిగుడ్డు..

దిగివచ్చిన చికెన్ ధర



మెదక్ కలెక్టరేట్: రోజు రోజుకు చికెన్ ధర పడిపోతుండగా.. కోడి గుడ్డు ధర కొండెక్కుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక గుడ్డు ధర రూ. 7 కాగా, కిలో చికెన్ రూ. 170కి పడిపోయింది. శీతాకాలంలో గుడ్డు ధర పెరగడం సాధారణమే అయినప్పటికీ, మరీ ఇంతగా పెరగడం అరుదని వ్యాపారులు అంటున్నారు. గుడ్డు ధర పెరగడంతో డజన్ కొనుగోలు చేసే వారు ప్రస్తుతం అర డజన్‌తోనే సరిపెడుతున్నారు. ఈనెలలోనే క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను భారీగా జరుపుకుంటారు. బేకరీ నిర్వాహకులు పెద్దఎత్తున కేక్‌లు తయారు చేసి విక్రయిస్తారు. అయితే వాటి తయారీలో కోడి గుడ్డు వాడుతుంటారు. మరోవైపు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలోనూ వినియోగిస్తారు. ప్రస్తుతం గుడ్డు ధర పెరగడం భారంగా మారిందని చెబుతున్నారు. ఇప్పటికే మధ్యాహ్న బిల్లులు మంజూరు కావడం లేదు. ఇదే సమయంలో కోడి గుడ్ల ధరలు పెరగడం మరింత భారంగా మారిందని మధ్యాహ్న భోజన కార్మికులు వాపోతున్నారు. కార్తీక మాసానికి ముందు కిలో చికెన్ ధర రూ. 230 నుంచి 240 ఉండగా, రోజురోజుకు ధర మరింత తగ్గుతోంది. ప్రస్తుతం కిలో చికెన్ ధర రూ. 170కు పడిపోయింది. రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని చికెన్ వ్యాపారులు చెబుతున్నారు.

కంపెనీలకే లాభం



గుడ్డు ధర పెరిగినా.. చికెన్ ధర తగ్గిన పౌల్ట్రీ రైతులకు ఎలాంటి లాభం ఉండదు. కంపెనీలకే ఆర్థిక లాభం ఉంటుంది. ప్రస్తుతం శీతాకాలం కావడంతో కోళ్ల ఉత్పత్తి అధికంగా ఉంటుంది. అందుకే చికెన్ ధరలు తగ్గాయి. ప్రస్తుత సీజన్‌లో గుడ్లను పిల్లల ఉత్పత్తి కోసం కంపెనీలు వినియోగిస్తాయి. అందువల్ల మార్కెట్‌లో విక్రయానికి తక్కువగా వస్తున్నాయి. వినియోగదారుల అవసరం మేరకు సరఫరా జరగక పోవడంతో కోడి గుడ్ల ధర పెరిగింది.

– సుకన్య, పౌల్ట్రీ నిర్వాహకులు, బండపోసాన్‌పల్లి

ధరా భారమే



కేక్‌ల తయారీలో కోడి గుడ్ల వినియోగం తప్పనిసరి. ప్రస్తుతం ధరలు పెరుగుతున్నప్పటికీ కేక్‌ల ధరలు పెంచలేని పరిస్థితి. పోటీ వ్యాపారం జరుగుతున్న సమయంలో తట్టుకునేందుకు ఆశించినస్థాయిలో లాభం లేకపోయిన విక్రయాలు చేస్తున్నాం. మరికొద్ది రోజుల్లో క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు ఉంటాయి. ఇదే సమయంలో గుడ్ల ధరలు పెరగడం ఒకింత భారంగా మారనుంది.

– ప్రదీప్, బేకరీ నిర్వాహకుడు, మెదక్

మహిళలపై దాడులు ఆగేదెన్నడు?

ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత



మాట్లాడుతున్న ఆశాలత

గజ్వేల్‌రూరల్: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో పాలకులు విఫలమయ్యారని ఐద్వా (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత ఆరోపించారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా గురువారం గజ్వేల్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ రోజురోజుకు మహిళలపై హత్యాచారాలు, దాడులు, గృహింస పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశం నలుమూలల ప్రతి నిత్యం పదుల సంఖ్యలో మహిళలపై హత్యాచారాలు జరుగుతున్నాయని, వీటిని నిరోధించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. మహిళలను వంటింటికే పరిమితం చేయాలని, వారిని తక్కువగా చూసే విధంగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సామాజిక, భౌతిక దాడులు, దౌర్జన్యాలతో మహిళలు జీవించే హక్కు ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

నాణ్యమైన ఆహారం తప్పనిసరి

కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్‌జోన్/పాపన్నపేట(మెదక్): విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, విద్యాసంస్థల్లో ఎట్టి పరిస్థితుల్లో ఫుడ్ పాయిజన్ కావొద్దని కలెక్టర్ రాహుల్‌రాజ్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయ మాట్లాడారు. సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల మధ్యాహ్న భోజనం కోసం డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచినట్లు తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి పెంపు అమల్లోకి వస్తుందన్నారు. ఆరోజు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, సంక్షేమ వసతి గృహాల్లో పాఠశాలల్లో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేస్తారని చెప్పారు. ఇందుకు అనుగుణంగా ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తు ఆహ్వానం పంపాలన్నారు. వంట పదార్థాలలో నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఈఓ రాధాకిషన్, ఎంఈఓలు, వసతి గృహాల వార్డెన్లు, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాపన్నపేట మండలం పొడ్చన్‌పల్లి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాన్ని సందర్శించారు. వైద్యులు, ఇతర సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. గైర్హాజరైన ఉద్యోగుల విషయమై జిల్లా వైద్యశాఖ అధికారికి ఫోన్ చేసి ఆరా తీశారు. వెంటనే నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అలాగే యూసూఫ్‌పేటలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. పారదర్శకంగా సర్వేను నిర్వహించాలని ఆదేశించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



చిన్నశంకరంపేటలో 108ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్

చిన్నశంకరంపేట(మెదక్): ప్రజలకు అత్యవసర వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకే మండలానికో 108ను ఏర్పాటు చేసినట్లు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నూతన 108ను ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రిని పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మెడికల్ ఆఫీసర్‌కు సూచనలు చేశారు. అలాగే తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశావర్కర్లు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. సంగాయిపల్లిలో తాగునీటి సమస్య నెలకొందని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ల గా మిషన్ భగీరథ డీఈకి ఫోన్ చేసి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేట అటవీ ప్రాంతంలో నగర వనయోజన పథకం కింద అర్బన్ పార్కు ఏర్పాటు కోసం పలు అభివృద్ధి పనులను గురువారం ఎమ్మెల్యే రోహిత్‌రావు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా జిల్లా అటవీశాఖ అధికారి జోజి, రేంజ్ అధికారి విద్యాసాగర్‌తో మాట్లాడి జంతువుల విషయమై ఆరా తీశారు. అంతకుముందు అక్కన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. స్కూల్‌లో ఏమైనా సమస్యలున్నాయా..? ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు హాజరవుతున్నారా..? భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పీసీసీ కార్యదర్శి సుప్రభాత రావు, జిల్లా నాయకులు గోపాల్‌రెడ్డి, హన్మంత రావు, యూత్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శులు రమేశ్, కుమార్ సాగర్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు యుగంధర్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పట్టని సర్కార్

- ఆరు నెలలుగా మెస్ బిల్లులు లేవు
- నాణ్యమైన ఆహారం లేదు..
- దీనావస్థకు చేరుకున్న హాస్టళ్లు, గురుకులాలు
- ఎమ్మెల్యే హరీశ్‌రావు ఫైర్
- సిద్దిపేటలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ సందర్శన



సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ దీనావస్థకు చేరుకుందని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సమీకృత వసతిగృహాన్ని సందర్శించారు. ముందుగా విద్యార్థుల గదులు, వంటశాల, బియ్యం, అన్నం, కూరలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, వార్డెన్‌లు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి పాలనలో సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు దీనస్థకు చేరుకున్నాయన్నారు. కాంగ్రెస్ పాలనలో ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 49 మంది విద్యార్థులు కలుషిత ఆహారంతో మృతి చెందారని, వేలాది మంది విద్యార్థులు ఆస్పత్రుల పాలయ్యారన్నారు. మూడు లక్షల కోట్ల బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం కోసం నిధులు లేవా అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో వెయ్యి గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించామన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఆరు నెలలుగా మెస్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు చెల్లించడం లేదన్నారు. సిద్దిపేటలోని ఈ ఒక్క హాస్టల్‌కే రూ.9.5లక్షల మెస్‌బిల్లులు రావాలన్నారు. నాణ్యమైన ఆహారం అందించకుంటే బాధ్యత వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులు వహించాలని ముఖ్యమంత్రి అంటున్నారని, తప్పు ముఖ్యమంత్రిది, శిక్షలు వీరికా అని అన్నారు. ప్రశ్నిస్తే ప్రతిపక్షాలను అరెస్టులు చేయడం, అక్రమ కేసులు బనాయించడం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా వసతిగృహాల మెస్ బిల్లులు విడుదల చేయాలన్నారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

అదనపు యూనిట్లు ఇవ్వండి

- సబ్సిడీ స్ప్రింక్లర్ల డ్రిప్ యూనిట్లపై ఉద్యాన శాఖ
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- ఈ ఏడాది నామమాత్రంగానే మంజూరు
- వీటి కోసం రైతుల నుంచి భారీగా డిమాండ్



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : రైతుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ ఉన్న సబ్సిడీ స్ప్రింక్లర్లు, డ్రిప్ పరికరాలకు సంబంధించి అదనపు యూనిట్లు మంజూరు చేయాలని కోరుతూ జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దాదాపు ఐదేళ్ల తర్వాత ఈ సూక్ష్మసేద్య పరికరాల యూనిట్లు జిల్లాకు మంజూరయ్యాయి. కానీ ఇవి అరకొరగా మంజూరు కావడంతో రైతుల అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అదనపు యూనిట్లు ఇవ్వాలని ఆ శాఖ ఉన్నతాధికారులను కోరారు. ఈ మేరకు ఉద్యానవన శాఖ రాష్ట్ర కార్యాలయానికి పది రోజుల క్రితం లేఖ పంపింది.

డిమాండ్ కొండంత.. మంజూరు అంతంతే!

2024–25 ఆర్థిక ఏడాదికి సంబంధించి 1,666 హెక్టార్లకు సరిపడా సూక్ష్మసేద్య పరికరాల యూనిట్లు మంజూరయ్యాయి. ఇందులో 1,463 హెక్టార్లకు సంబంధించి డ్రిప్ యూనిట్లు కాగా, మిగిలిన 203 హెక్టార్ల స్ప్రింక్లర్ల యూనిట్లు ఉన్నాయి. అయితే ఈ పరికరాల కోసం రైతుల నుంచి డిమాండ్ భారీగా ఉంది. వీటికోసం ఇప్పటివరకు 10,031 మంది రైతులు తమ 12,698 హెక్టార్లకు సంబంధించిన ఈ డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు ఇవ్వాలని దరఖాస్తులు చేసుకున్నారు. సుమారు ఎనిమిదేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్న రైతులు కూడా ఉన్నారంటే వీటి డిమాండ్ ఏ మేరకు ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఈ సబ్సిడీ యూనిట్ల మంజూరును గత ప్రభుత్వం చాలా ఏళ్లు నిలిపివేసింది. చివరిసారిగా 2019లో ఈ యూనిట్లు మంజూరయ్యాయి. దాదాపు ఐదేళ్ల తర్వాత ఈ ఆర్థిక ఏడాదిలో ఈ యూనిట్లు వచ్చాయి.

అధికంగా సబ్సిడీ ఇస్తుండటంతో...

మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు కింద (టీజీఎంఐపీ) ప్రభుత్వం ఈ సూక్ష్మ సేద్య పరికరాల యూనిట్లను అందిస్తోంది. ఈ యూనిట్లపై ఇచ్చే సబ్సిడీ ఎక్కువ మొత్తంలో ఉండటంతో వీటికి డిమాండ్ అధికంగా ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 (ఉచితంగా) సబ్సిడీపై ఈ యూనిట్లు అందజేస్తారు. ఐదెకరాల లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులు యూనిట్ ఖర్చులో 10% మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన 90% మొత్తాన్ని ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. పెద్ద రైతులు మాత్రం యూనిట్ వ్యయంలో 20% చెల్లించాలి. మిగిలిన 80% సబ్సిడీ ఉంటుంది. దీంతో వీటికోసం డిమాండ్ అధికంగా ఉంటుంది. యూనిట్ వ్యయాన్ని బట్టి ఒక్కో రైతుకు సుమారు రూ.92 వేల వరకు సబ్సిడీ వస్తుంది.

సీనియారిటీ మేరకు...

సీనియారిటీని బట్టి లబ్ధిదారుల ఎంపిక ఉంటుంది. ఈ యూనిట్ల కోసం రైతులు మీ–సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఎవరుముందు దరఖాస్తు చేసుకుంటే వారికి ఈ యూనిట్ల కేటాయింపులు ఉంటాయి. అయితే సుమారు ఎనిమిదేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్న రైతులకు ఇంకా యూనిట్లు అందలేదు. కాగా, మామిడి, జామ, డ్రాగన్‌ఫ్రూట్ వంటి పండ్లతోటలు, అల్లం, ఆలుగడ్డలు, చెరుకు వంటి పంటలు సాగు చేసుకునే రైతుల నుంచి వీటికి అధికంగా డిమాండ్ ఉంది. ప్రధానంగా జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్ డివిజన్ల కు చెందిన ఎక్కువమంది రైతులు వీటి కోసం దరఖాస్తులు చేసుకున్నారు.

న్యూస్‌రీల్

మెరుగైన ఫలితాలు సాధించాలి



డీఐఈఓ మాధవిని సన్మానిస్తున్న అధ్యాపకులు

చిన్నశంకరంపేట(మెదక్): ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారిణి మాధవి సూచించారు. గురువారం నార్సింగి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివితేనే సత్ఫలితాలు వస్తాయన్నారు. గతేడాది ఫలితాల కంటే మెరుగైన ఫలితాలు సాధించాని అధ్యాపకులను ఆదేశించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ నరేందర్‌గౌడ్‌కు పలు సూచనలు చేశారు.

రాజీయే రాజమార్గం



మాట్లాడుతున్న న్యాయమూర్తి లక్ష్మీశారద

మెదక్ కలెక్టరేట్: రాజీయే రాజమార్గమని, ఈనెల 14వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. రాజీ పడటం వల్ల ఇరువర్గాలు గెలిచినట్లేనని అన్నారు. సివిల్, క్రిమినల్, కుటుంబ తగాదాలు, మోటార్ వెహికల్.. తదితర కేసుల్లో కక్షిదారులు రాజీ చేసుకునే అవకాశం ఉందన్నారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ మొత్తంలో కేసులు రాజీకుదుర్చుకునేలా పోలీసులు, న్యాయవాదులు కృషి చేయాలని సూచించారు.

'ఇందిరమ్మ' సర్వే అడ్డగింత



పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కాంగ్రెస్ నాయకులతో కలిసి చేయడం ఏంటని బీఆర్‌ఎస్ నాయకులు సర్వేను అడ్డుకున్నారు. ఈసంఘటన మండలంలోని ధర్మాసాగర్‌లో జరిగింది. గురువారం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి నరహరి సర్వేను ప్రారంభించగా.. ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. గ్రామస్తులకు కనీసం సమాచారం ఇవ్వకుండా, కాంగ్రెస్ నాయకులతో కలిసి సర్వే ఎలా చేస్తారని పంచాయతీ కార్యదర్శిని బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నించి సర్వేను అడ్డుకున్నారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ.. అధికారులు ఇందిరమ్మ కమిటీ సభ్యులకు సమాచారం ఇవ్వమన్నారని తెలిపారు. కాగా మొదటి రోజు ఐదు ఇళ్ల సర్వే చేశామని చెప్పారు.

చంటి పిల్లలతో సమ్మెలో..



చంటి పిల్లలతో సమ్మెలో మహిళా ఉద్యోగులు

మెదక్ కలెక్టరేట్: సమగ్ర శిక్షా మహిళా ఉద్యోగులు గురువారం తమ పిల్లలతో కలిసి నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకొని తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి నేడు విస్మరించడం సరికాదన్నారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.

ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు రావాలి

గజ్వేల్: ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని ఏడీఏ బాబునాయక్ అన్నారు. గురువారం అహ్మదీపూర్‌లో రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు వల్ల రైతులకు పెట్టుబడులు తగ్గి నికర ఆదాయం పెరుగుతుందని చెప్పారు. మొదటి మూడేళ్లు ఈ తోటల్లో అంతర పంటలతో సాగుతో ఆదాయం పొందే అవకాశం ఉంటుందని, నాలుగో ఏడాది నుంచి ఆయిల్‌పామ్ నుంచి ఆదాయం ప్రారంభమవుతుందన్నారు. ఆయిల్‌ఫెడ్ సంస్థ జిల్లా ఇన్‌చార్జి అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు చేయాలనుకునే రైతులు తమ పరిధిలోని ఏఈఓల వద్ద వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సదస్సులో ఏఓ నాగరాజు, ఏఈఓ అనూష, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి హ్యాండ్‌ బాల్‌ పోటీలకు అన్విత ఎంపిక



అన్వితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌

మద్దూరు(హుస్నాబాద్‌): జాతీయస్థాయి హ్యాండ్‌ బాల్‌ పోటీలకు మండల కేంద్రంలోని మోడల్‌ స్కూల్‌లో ఇంటర్‌ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గుండె అన్విత ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్‌ అందె గణేశ్‌ తెలిపారు. ఇటీవల తుక్కుగూడలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌ బాల్‌ పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. 17న పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు.

14న సాఫ్ట్‌బాల్‌ జిల్లా జట్ల ఎంపిక

– ప్రజ్ఞాపూర్‌లో రాష్ట్రస్థాయి పోటీలు

గజ్వేల్‌రూరల్‌: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్‌ పోటీల్లో పాల్గొనేందుకు 14న జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు సాఫ్ట్‌బాల్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు కైలాసం గుప్త, ప్రధాన కార్యదర్శి రేణుక గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సీఎం కప్‌ 2024 రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్‌ పోటీలకు ఓపెన్‌ కేటగిరీలో పురుష, మహిళ క్రీడాకారులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. గజ్వేల్‌ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల సెయింట్‌ మేరీస్‌ విద్యానికేతన్‌లో జరిగే ఎంపిక ప్రక్రియలో పాల్గొనే క్రీడాకారులు సీఎం కప్‌ వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసి, సంబంధిత పత్రాన్ని అందించాలని సూచించారు. క్రీడాకారులు తమ వ్యక్తిగత క్రీడా సామగ్రిని వెంట తెచ్చుకోవాలని, మరిన్ని వివరాలకు 79819 23779 నంబరును సంప్రదించాలని తెలిపారు.

కొండ చిలువ కలకలం



కొండపాక(గజ్వేల్‌): కొండపాక మండలంలోని దమ్మక్కపల్లిలోని వ్యవసాయ బావి వద్ద కొండ చిలువ కలకలం సృష్టించింది. గ్రామానికి చెందిన బండి మల్లయ్య వ్యవసాయ బావి వద్ద పనులు చేస్తుండగా పొలంలో కొండ చిలువ కనిపించడటంతో భయాందోళనకు గురై చుట్టు పక్కల రైతులకు సమాచారం అందించాడు. పారిపోతుండటంతో చంపేశారు. ఇది వరకు మర్పడ్గలో కొండ చిలువ కనిపించింది. రోజుకో గ్రామంలో బయట పడటంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

గంజాయి రవాణా కేసులో ఒకరి అరెస్ట్‌



పట్టుబడ్డ గంజాయి

రామాయంపేట(మెదక్‌): గంజాయి అక్రమ రవాణా కేసులో బిహార్‌కు చెందిన నిందితుడిని పోలీసులు అరెస్ట్‌ చేశారు. స్థానిక సీఐ వెంకట్‌ రాజాగౌడ్‌ గురువారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. అక్టోబర్‌ 19న రామాయంపేట శివారులో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురైన కారులో 87 కేజీల గంజాయి లభించింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఈ వాహనానికి పైలట్‌గా వెనుక వస్తున్న మరో కారులో అమిత్‌కుమార్‌ వచ్చి క్షతగాత్రులను తీసుకెళ్లారు. అయితే, ప్రమాదానికి గురైన కారు నంబర్‌ ఒరిజనల్‌ కాదని, మరో డూప్లికేట్‌ నంబర్‌ వేశారని పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో ఛాసెస్‌ నంబర్‌ సహాయంతో అసలు నంబర్‌ గుర్తించారు. ప్రమాదానికి గురైన కారు ఉత్తర ప్రదేశ్‌కు చెందినదిగా గుర్తించారు. అక్కడి పోలీసుల సహకారంతో బీహార్‌ రాష్ట్రానికి చెందిన అమిత్‌కుమార్‌ను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరికొందరిని త్వరలో అరెస్ట్‌ చేస్తామని సీఐ ప్రకటించారు.

చుక్‌ చుక్‌ పనులు.. చకచకా



పూర్తయిన అప్రోచ్‌ రోడ్డు



రైల్వే స్టేషన్‌లో కొనసాగుతున్న పనులు

తుది దశకు కొమురవెల్లి రైల్వే స్టేషన్‌ పనులు

- 70 శాతం నిర్మాణాలు పూర్తి
- మల్లన్న భక్తులకు తప్పనున్న తిప్పలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న భక్తులకు త్వరలో ప్రయాణ తిప్పలు తప్పనున్నాయి. మనోహరాబాద్‌–కొత్తపల్లి వరకు చేపడుతున్న రైల్వే లైన్‌లో మధ్యలోని కొమురవెల్లి రైల్వే స్టేషన్‌ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. దీంతో ఎంతో కాలంగా వేచి చూస్తున్న భక్తుల కల నెరవేరనుంది.

కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ఏటా మూడు నుంచి నాలుగు నెలలపాటు జరుగుతాయి. బ్రహ్మోత్సవాలకు తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిషా, ఛత్తీస్‌గఢ్‌, కర్నాటక, మహారాష్ట్రాల నుంచి లక్షాలాది మంది భక్తులు వస్తారు. స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు. ప్రతీసారి భక్తులు ఇక్కడికి రావడానికి ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం కొమురవెల్లిలో స్టేషన్‌ ఏర్పాటు పూర్తి కావొస్తుండటంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ప్రయాణ ఖర్చులతోపాటు సమయం కూడా ఆదా కానుంది. రైల్వే స్టేషన్‌, ప్లాట్‌ఫామ్‌, అప్రోచ్‌ రోడ్డు పనులు సుమారు 70 నుంచి 80 వరకు పూర్తికావొచ్చాయి. స్వామి వారి బ్రహ్మోత్సవాల నాటికి పనులు పూర్తి చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రైల్వే అధికారులను ఆదేశించడంతో స్టేషన్‌ నిర్మాణ పనులు చకచకా నడుస్తున్నాయి. మిగితా పనులు పూర్తయితే జనవరి 15లోపు స్టేషన్‌ ప్రారంభిస్తారని విశ్వసనీయ సమాచారం. అతి తక్కువ కాలంలో కొమురవెల్లిలో రైల్వే స్టేషన్‌ పనులు పూర్తి కానుడటంతో స్థానికులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కష్టాలు తీరనున్నాయి



కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు రైల్వే స్టేషన్‌ ఏర్పాటు చేయడంతో ప్రయాణ కష్టాలు తీరుతాయి. అంతే కాకుండా కొమురవెల్లిలోని వ్యాపారస్తులకు కూడా సరుకుల రవాణా వ్యయం తగ్గుతుంది.

– కొండ శ్రీధర్‌, స్థానికుడు

త్వరగా పూర్తి చేస్తాం

కొమురవెల్లి రైల్వే స్టేషన్‌ పనులను స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం ఇప్పటికే ప్లాట్‌ఫామ్‌, అప్రోచ్‌ రోడ్డు పనులు పూర్తికావొచ్చాయి. మిగితా పనులు త్వరలో పూర్తి చేయిస్తాం.

– మూర్తి, రైల్వే ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌

రోడ్డు ప్రమాదంలో బీటెక్‌ విద్యార్థి మృతి

కాలేజీకి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ



ప్రమాద స్థలంలో హేమంత్‌ మృతదేహం

పటాన్‌చెరు టౌన్‌: రోడ్డు ప్రమాదంలో బీటెక్‌ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. అమీన్‌పూర్‌ సీఐ సదా నాగరాజ్‌ కథనం మేరకు.. సంగారెడ్డిలో ఉండే ఏఆర్‌ కానిస్టేబుల్‌ కిష్టన్న కుమారుడు హేమంత్‌ కుమార్‌ (22) మేడ్చల్‌ సీఎంఆర్‌ కళాశాలలో బీటెక్‌ ఫైనల్‌ ఇయర్‌ చదువుతున్నాడు. సంగారెడ్డి నుంచి రోజూ బైక్‌పై కాలేజీకి వెళ్లి వస్తుంటాడు. గురువారం ఉదయం సంగారెడ్డి నుంచి స్నేహితుడు ప్రణయ్‌ కుమార్‌తో కాలేజీకి బయలుదేరాడు. కిష్టారెడ్డిపేట రింగ్‌ రోడ్‌ సర్వీస్‌లోకి రాగానే గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హేమంత్‌ కుమార్‌ అక్కడికక్కడే మృతి చెందగా, ప్రణయ్‌ కుమార్‌కు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన ప్రణయ్‌ కుమార్‌ను చికిత్స కోసం బీరంగూడలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన జగదేవ్‌పూర్‌లో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్‌ కథనం మేరకు.. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం బీమారిగూడెం గ్రామానికి చెందిన పిట్టల వెంకటయ్య (50) బుధవారం వ్యవసాయ పొలానికి మందుల కోసం బస్సులో జగదేవ్‌పూర్‌కు వచ్చారు. మందులు తీసుకొని రోడ్డు దాటుతున్న క్రమంలో భువనగిరి నుంచి ప్రజ్ఞాపూర్‌ వైపు వెళ్తున్న గ్రానైట్‌ లారీ వెంకటయ్యను ఢీకొట్టింది. వెంటనే 108 ద్వారా గజ్వేల్‌ ప్రభుత్వాస్పతికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రెండు బైక్‌లు ఢీ : ముగ్గురికి గాయాలు



ఘటనా స్థలంలో క్షతగాత్రులు

కౌడిపల్లి(నర్సాపూర్‌): రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని తునికిగేట్‌ సమీపంలో 765డి జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. రాయిలాపూర్‌ తండాకు చెందిన చిన్న, లక్ష్మి, చిట్టి బైక్‌పై నర్సాపూర్‌ నుంచి ఇంటికొస్తున్నారు. వెంకట్రావుపేట నుంచి ఇద్దరు బైక్‌పై తునికి వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో తునికి గేట్‌ వద్దకు రాగానే రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చిన్న, లక్ష్మి, చిట్టికి గాయాలు కాగా నర్సాపూర్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాలు విరిగి తీవ్ర గాయాలైన లక్ష్మిని సంగారెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు


– ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

కౌడిపల్లి(నర్సాపూర్‌): బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన కౌడిపల్లి మండలం అంతారం గేటు సమీపంలోని హైదరాబాద్‌–బోధన్‌ ప్రధాన రహదారిపై గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. చిలప్‌చెడ్‌ మండలం రహీంగూడ గ్రామానికి చెందిన నీరుడి కిష్టయ్య(42), కాన్రోత్‌ రెడ్యా ఇద్దరూ బైక్‌పై మండల కేంద్రమైన కౌడిపల్లిలో మార్కెట్‌ ఉండడంతో వెళ్లారు. పనులు ముగించుకొని రహీంగూడకు తిరిగి వెళ్తుండగా మెదక్‌ నుంచి హైదరాబాద్‌ వైపు వెళ్తున్న ఓ కారు వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. అనంతరం కారు రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న కిష్టయ్య అక్కడికక్కడే మృతి చెందగా, రెడ్యా తీవ్ర గాయాలతో నర్సాపూర్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

మద్యానికి బానిసై వ్యక్తి..

గజ్వేల్‌రూరల్‌: మద్యానికి బానిసైన వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ములుగు మండలం బండ నర్సంపల్లికి చెందిన కొంతం లక్ష్మయ్య, హంసవ్వ దంపతులు కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వంటిమామిడి మార్కెట్‌ నుంచి కూరగాయలను కొనుగోలు చేసి గజ్వేల్‌లో విక్రయిస్తుంటారు. బుధవారం ఇంటి నుంచి వెళ్లిన లక్ష్మయ్య రాత్రి అయినా రాకపోవడంతో మద్యం తాగి ఎక్కడో ఓ చోట ఉండవచ్చని భార్య భావించింది. తోటి చిరు వ్యాపారి రాములమ్మ గజ్వేల్‌ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్‌ కూరగాయల మార్కెట్‌ గేటు ఎదుట లక్ష్మయ్య మృతి చెంది ఉన్నాడని హంసవ్వకు సమాచారం ఇచ్చింది. భర్త మృతదేహాన్ని చూసిన ఆమె బోరున విలపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మద్యానికి బానిసై భర్త మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడు..



రాజు(ఫైల్‌)

మిరుదొడ్డి(దుబ్బాక): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రమైన మిరుదొడ్డిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కుమ్మరి రాజు (28) తనకున్న రెండు ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ భార్య మేఘమాల, ఎనిమిదేళ్లలోపు ఇద్దరు కుమారులు, కూతురుతోపాటు తల్లిదండ్రులు కనకలక్ష్మి శివయ్యలను పోషించుకుంటున్నాడు. వ్యవసాయ విత్తనాల కొనేందుకు 9న బైక్‌పై గజ్వేల్‌ వెళ్తున్నాడు. అదే సమయంలో చెప్యాల గ్రామానికి చెందిన యాదగిరి బైక్‌పై వస్తుండగా ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన రాజును దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బోయిని పరుశరాములు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

శివ్వంపేట(నర్సాపూర్‌): తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండల పరిధి గోమారం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బొల్లారం పోచయ్య 10న ఇంటికి తాళం వేసి భార్య, తల్లితో కలిసి ఆస్పత్రికి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి పోచయ్య ఇంట్లో చొరబడి రూ.30 వేల నగదు, 10 తులాల వెండి, పావుతులం బంగారం ఆభరణాలు ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం ఇంటి గేటు తాళాలు పగులగొట్టి ఉన్న విషయం గుర్తించిన పక్కంటివారు బాధితులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ మధుకర్‌ రెడ్డి, క్లూస్‌ టీమ్‌ సిబ్బంది పరిశీలించి ఆధారాలు సేకరించారు.

ఆర్థిక సమస్యలతో దొంగతనాలకు అలవాటు

– నిందితుడి అరెస్ట్‌, రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజు

పటాన్‌చెరు టౌన్‌ : గొలుసు దొంగను పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం సాయంత్రం పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో క్రైం సీఐ రాజు వివరాలు వెల్లడించారు. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం ఎన్‌ఆర్‌ఐ కాలనీలో 3వ తేదీన పాఠశాల నుంచి కుమారుడిని తీసుకెళ్తున్న భాగ్యమ్మ మెడలోంచి నుంచి గుర్తుతెలియని దుండగులు పుస్తెలతాడు లాక్కొని వెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించి నిందితుడి ఆనవాళ్లు సేకరించారు. గురువారం సాయంత్రం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో వాహన తనిఖీలు చేస్తుండగా పోలీసులను చూసి ఓ వ్యక్తి వెనక్కి వెళ్లిపోవడంతో అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొని విచారించారు. చైన్‌ స్నాచింగ్‌ చేసినట్లు ఒప్పుకున్నాడు. పట్టుబడిన నిందితుడు నారాయణఖేడ్‌ మండలం నిజాంపేట్‌కు చెందిన దత్తరాజ్‌గా గుర్తించారు. ప్రస్తుతం చిట్కుల్‌ వడ్డెర కాలనీలో ఉంటూ ఆర్థిక సమస్యలు ఉండటంతోనే ఈ దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. నిందితుడి నుంచి 3 తులాల బంగారం, బైక్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. కేసులో కీలక పాత్ర పోషించిన ఎస్‌ఐ కోటేశ్వర్‌ రావు, అబ్దుల్‌ రజాక్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.







మాట్లాడుతున్న మంత్రులు పొన్నం, కొండా సురేఖ, వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

మల్లన్న కల్యాణం వైభవంగా నిర్వహించాలి

- భక్తులకు ఇబ్బందులు ఉండొద్దు
- అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి
- జిల్లా అధికారులతో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌ వీడియో కాన్ఫరెన్స్‌

కొమురవెల్లి(సిద్దిపేట):కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణం, జాతరలను తెలంగాణ ఆధ్యాత్మిక, సంస్కృతి సంప్రదాయలు ప్రతిబింబించేలా వైభవోపేతంగా నిర్వహించాలని మంత్రి కొండా సురేఖ జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం సెక్రటేరియట్‌లోని దేవదాయ, ధర్మాదాయ మంత్రిత్వశాఖ కార్యాలయం నుంచి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌, కలెక్టర్‌ మను చౌదరితో కలిసి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ.. గతేడాది కంటే మరింత వైభవోపేతంగా మల్లికార్జున స్వామి కల్యాణం నిర్వహిస్తామన్నారు. కల్యాణం 29న ఉదయం 10.45 గంటలకు తోట బావి ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలు జనవరి 19 నుంచి మార్చి 23 వరకు జరుగుతాయన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పోలీస్‌, విద్యుత్‌, వైద్యారోగ్యం, ఆర్టీసీ, పంచాయతీ రాజ్‌, గ్రామీణ నీటి సరఫరా తదితర శాఖల అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అమ్మవార్లకు బంగారు కిరీటాల తయారీ పనులపై ఆరా తీశారు. భక్తులకు తాగునీటి వసతి, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని ఆలయ ఈవో బాలాజీని ఆదేశించారు. స్వామి ప్రసాదం తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆలయ అధికారులను ఆదేశించారు. స్వామి వారి కల్యాణానికి సీఎం రేవంత్‌ రెడ్డిని ఆహ్వానించనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌ మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాల్లో శానిటేషన్‌ , పార్కింగ్‌ పై ప్రత్యేక దృష్టి శారించాలని, కల్యాణ వేదికపైకి వచ్చే వారి పాసులు పోలీసుల అప్రూవల్‌ ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ అబ్దుల్‌ హమీద్‌, ఆలయ ఈవో బాలాజీ, ఆలయ పాలకవర్గ సభ్యులు, డీఆర్‌వో నాగరాజమ్మ, సిద్దిపేట ఆర్డీవో సదానందం, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

దంపతులను బలి తీసుకున్న అతివేగం

- టీవీఎస్‌ ఎక్సెల్‌ను ఢీకొట్టిన జీపు
- భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి
- కల్హేర్‌ మండలంలో ఘటన



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ వెంకటేశం



సంగ్యనాయక్‌ (ఫైల్‌)



సంగీతబాయి(ఫైల్‌)

కల్హేర్‌(నారాయణఖేడ్‌): అజాగ్రత్త డ్రైవింగ్‌ దంపతులను బలి తీసుకుంది. థార్‌ జీపు వాహనం ఢీకొని భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందిన ఈ విషాదకర ఘటన సంగారెడ్డి జిల్లా కల్హేర్‌ మండలంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్‌ మండలం మల్లూరు తండాకు చెందిన దంపతులు విస్లావత్‌ సంగ్యానాయక్‌(71), సంగీతబాయి(67) టీవీఎస్‌ ఎక్సెల్‌ వాహనంపై సంగీతబాయి సోదరి కూతురు వద్దకు నారాయణఖేడ్‌ వెళ్తున్నారు. అలాగే, కృష్ణాపూర్‌లో గృహ ప్రవేశం వేడుకకు హాజరైన పురోహితులను ఆ ఇంటి వారు జీపులో నిజాంపేటలో వదిలేసి తిరిగి వస్తున్నారు. మార్గమధ్యలో కృష్ణాపూర్‌ మెట్టుకుంట తండా సమీపంలోకి రాగానే అతివేగంగా వస్తున్న థార్‌ జీపు దంపతుల ఎక్సెల్‌ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. శరీర భాగాలు ఛిద్రమై విగతజీవులయ్యారు. అదే వేగంతో జీపు రోడ్డు కిందికి దూసుకెళ్లింది. విషయం తెలుసుకున్న కల్హేర్‌ ఎస్‌ఐ వెంకటేశం ఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాదం గురించి తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ప్రమాదానికి కారణమైన వ్యక్తులు జీపు వదిలేసి పారిపోయినట్లు ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు.

మెదక్‌ చర్చికి రూ. 29.18 కోట్లు

- వందేళ్ల పండుగ సందర్భంగా నిధుల కేటాయింపు
- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్‌జోన్‌: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్‌ కెతిడ్రల్‌ చర్చ్‌కు నిధుల వరద వస్తుందని మెదక్‌ నియోజక వర్గ ఎమ్మెల్యే డాక్టర్‌ మైనంపల్లి రోహిత్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 25వ తేదీ నాటికి ఈ మహాదేవాలయానికి వందేళ్లు పూర్తి కానున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలో నా విజ్ఞప్తి మేరకు సీఎం రేవంత్‌ రెడ్డి వందేళ్ల మహాదేవాలయ సన్నిధికి రూ.29.18 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. యాత్రికుల సౌకర్యార్థం రూ.24.50 కోట్లతో వసతి గృహాల నిర్మాణం, మంచినీటి సరఫరా కోసం రూ.1.50 కోట్లు, చర్చి ఆవరణలో ఏసుక్రీస్తు విగ్రహ ఏర్పాటుకు రూ.45 లక్షలు, చర్చి ప్రాంగణంలో సెంట్రల్‌ లైటింగ్‌కు రూ.18 లక్షల 50 వేలు, చర్చి పరిసరాల్లో సీసీ రోడ్లకు రూ.2 కోట్ల 55 లక్షలు వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

‘ఐఎన్‌టీయూసీ’తోనే సమస్యలు పరిష్కారం

యూనియన్‌ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కార్మికుల సమస్యలు కేవలం ఐఎన్‌టీయూసీతోనే పరిష్కారం అవుతాయని సంఘం జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి అన్నారు. గురువారం భెల్‌ టౌన్‌షిప్‌లో భెల్‌ ఐఎన్‌టీయూసీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్‌ నూతన కేలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సంజీవరెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల శ్రేయస్సు, అభివృద్ధి కోసం పనిచేసే యూనియన్‌ నాయకత్వానికి కార్మికులు అండగా నిలవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దానిని అడ్డుకొని తీరుతామని తెలిపారు. తమ నాయకులు నిత్యం కార్మికుల మధ్యలో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తారని తెలిపారు. కార్యక్రమంలో భెల్‌ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు రెహమాన్‌, నాయకులు సత్యజిత్‌ రెడ్డి, చంద్రశేఖర్‌, నర్సింహారెడ్డి, స్వామి, జనార్దన్‌ రెడ్డి, కొండల్‌రెడ్డి, శ్రీరామ్‌ నాయక్‌, తదితరులు పాల్గొన్నారు.

కడుపు నొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

కొండపాక(గజ్వేల్‌): కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్‌ కథనం మేరకు.. కొడకండ్ల గ్రామానికి చెందిన తిప్పారం పెంటయ్య(75) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. 10న ముద్దాపూర్‌ గ్రామంలో కూతురి ఇంట్లో తొట్టెల పండుగ కోసం భార్య బాలమ్మతో కలిసి వెళ్లారు. మరుసటి రోజు వ్యవసాయ బావి వద్ద పని ఉందంటూ ముద్దాపూర్‌ నుంచి కొడకండ్లకు వచ్చాడు. గురువారం భార్య పండుగ ముగించుకొని మనవడు రవితో ఇంటికి రాగ భర్త పెంటయ్య కనిపించలేదు. వ్యవసాయ బావి వద్ద చూసి రమ్మని మనవడు రవిని పంపించగా పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని వేసుకొని కనిపించాడు. విషయాన్ని బాలమ్మకు ఫోన్‌ ద్వారా చెప్పడంతో హుటాహుటినా వచ్చి చూసి బోరున విలపించింది. కొద్దిరోజుల భర్త అనారోగ్యంతో బాధపడుతున్నాడని, ఈ క్రమంలో కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆందోళన నడుమ ఎంజాయ్‌మెంట్‌ సర్వే

- చౌటపల్లిలో అడ్డుకున్న రైతులు
- అరగంటపాటు రెవెన్యూ అధికారులతో వాదనలు
- మొదటి రోజు జనగామ శివారులో పూర్తి
- 17వ తేదీన నోటిఫికేషన్‌ విడుదల!



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్‌ అనంతరెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్‌): అక్కన్నపేట మండలం చౌటపల్లి క్రాసింగ్‌ వద్ద ఎంజాయ్‌మెంట్‌ సర్వే గురువారం ప్రారంభం కాగా రైతులు అడ్డుకోవడంతో కాసేపు అధికారులతో వాదోపవాదనలు జరిగాయి. సర్వే చేసేందుకు మొదట ఆర్‌ఐ యాదగిరి, సర్వేయర్‌ లక్ష్మీనారాయణ, హుస్నాబాద్‌ ఆర్‌ఐ రాజయ్య మండలంలోని జనగామ స్టేజీ వద్దకు చేరుకున్నారు. అప్పటికే విషయం తెలుసుకున్న చౌటపల్లి రైతులు స్టేజీ వద్ద గుంపులుగా నిలబడ్డారు. సర్వేకు ఎందుకొచ్చారు.. ఇండస్ట్రీయల్‌ పార్క్‌కు భూములు ఇవ్వబోమని అన్నారు. పట్టాకు ఉన్నాం.. కానీ మోకాపై వేరే రైతులు ఉన్నారని, తమకు న్యాయం ఎలా చేస్తారో చెప్పాలని అరగంటపాటు అధికారులతో వాదించారు. వెంటనే ఆర్‌ఐ ఫోన్‌ ద్వారా తహసీల్దార్‌ అనంతరెడ్డికి విషయం చెప్పారు. హుటాహుటినా అక్కడికి చేరుకున్న తహసీల్దార్‌ రైతులతో మాట్లాడారు. గతంలో నిరుపేద రైతులకు ప్రభుత్వం ఇచ్చిన 85.35 ఎకరాల అసైన్డ్‌ భూమిలో కబ్జాపై ఎవరున్నారు? పట్టాకు ఎవరున్నారు? ఏఏ పంటలను సాగు చేస్తున్నారు? సాగులో భూమి ఉందా? లేదా అనేది తెలుసుకునేందుకే ఎంజాయ్‌మెంట్‌ సర్వేను నిర్వహిస్తున్నామని రైతులకు నచ్చజెప్పారు. అనంతరం డీఐ, ముగ్గురు సర్వేయర్లు, ఇద్దరు ఆర్‌ఐల పర్యవేక్షణలో ఎంజాయ్‌మెంట్‌ సర్వే చేపట్టారు. మొదటి రోజు జనగామ శివారులో దాదాపు 25 నుంచి 30 ఎకరాల వరకు సర్వే పూర్తి చేసినట్లు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. రేపటి నుంచి ఎవరి భూమి వద్ద వాళ్లే ఉండాలని రైతులందరికీ సమాచారం ఇచ్చామని తహసీల్దార్‌ పేర్కొన్నారు. రెండు, మూడు రోజుల్లో సర్వే పూర్తి చేస్తామని, రైతులందరూ సహకరించాలన్నారు. సర్వే కొనసాగుతున్న క్రమంలో కొంతమంది రైతులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ప్రత్యేక పోలీస్‌ బలగాలు పహారా నిర్వహించారు.

పూర్తి కాగానే నోటిఫికేషన్‌!

ఇండస్ట్రీయల్‌ పార్క్‌ నిర్మాణానికి 17న నోటిఫికేషన్‌ విడుదల కానున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఎంజాయ్‌మెంట్‌ సర్వే పూర్తి కాగానే నోటిఫికేషన్‌ విడుదల చేస్తారని సమాచారం. ఇప్పటికే ఇండస్ట్రీయల్‌ పార్క్‌ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చినట్లు తెలుస్తోంది.